# శిలువమీద చివురు

**-కుసుమారెడ్డి**



ఉదయం పది గంటలు.

రాత్రంతా మానసిక అలసటతో నిద్ర రాక తెల్లవారుజామున కునుకు పట్టిన రాజశేఖరం 'టక్ టక్'మన్న చప్పుడుకు ఉలిక్కిపడి లేచాడు. కళ్లు నులుముకుంటూ కంగారుగా వీధి వరండాలోకి వచ్చాడు.

నిన్నటివరకు పచ్చని ముత్తైదువులా ఉన్న తోట పచ్చదనం పోయి తల చెడిన ఆడపిల్లలా ఉంది.

జంతుబలానికి బలయిన మొక్కలని మొదళ్లవరకు తవ్వి కొత్త మొక్కలు పాతడానికి నేల చదును చేస్తున్నారు కూలివాళ్ళు.

మరోపక్క కొత్త రాటలు పాతి ఆకులు దూస్తూ మరో మనిషి దడి కడుతున్నాడు.

గోడనానుకుని కోడలి మనస్తత్వాన్ని ఎలా అర్థం చేసుకోవాలో, ఎలా చెబితే ఆమె వింటుందో తెలియక గిజగిజలాడుతున్నాడు రాజశేఖరం.

కోడలు ఏం సాధిద్దామని ఇలా చేస్తోంది? ఎక్కడెక్కడి నుండో బోలెడు డబ్బులు ఖర్చు చేసి మొక్కలు తెప్పించడం, అవి ఏపుగా పెరిగి పుష్పించి, కాయ పిందెలతో ఉన్నప్పుడు జంతు బలానికి బలవ్వడం గత పదేళ్ళ నుండి జరుగుతున్న విషయమే!

పెంచిన మొక్కలు ఈ విధంగా బలైతే తనలాంటివాళ్ళకుఎంత గుండె కోతో. అందుకే వెయ్యొద్దని చెప్పాడు.

దానికి కోడలు మరోలా అర్థం చేసుకుంది.

చేసేది లేక తల వంచుకున్నాడు.

వంటింట్లో నుండి "కాఫీ!" అన్న పిలుపుకి ఉలిక్కిపడ్డాడు.

కంగారుగా మొహం కడుక్కోవడానికని పెరట్లోకి వెళ్ళాడు. వంటింట్లో నుండి కోడలి మాటలు తారాస్థాయిలో వినిపిస్తున్నాయి.

"ఆ ముసలాయన్ని అనాలి! బోడి ఇల్లు కట్టించుకోగానే సరా! ప్రహరీ కట్టించుకోవాలనే జ్ఞానం ఉండొద్దూ! ముసలాళ్ళు చాలామంది ఉంటారు కానీ, మీ నాన్నలాంటి వాళ్ళు ఉండటం ఏదో శాపం. వాకిట్లో మొక్కలు వేసినప్పుడల్లా చేతబడి చూపులు చూస్తాడు. చంటిబిడ్డ పాడి కుండ సమానం అని పెద్దలు అంటారు. ఏం చూసినా మాడి మసి అయిపోతాయి. మొక్క వేస్తుంటే చాలు, 'ఎందుకమ్మా!' అని చావుపాట. మూడేళ్ళనాడు పిల్లలిద్దర్నీ బడిలో వేస్తుంటే పసి పిల్లల్ని బడిలో వేస్తావా అని రాద్ధాంతం. ఈయన ఏడ్పులాగే చిన్నాడు వేసిన రెండురోజులకే పారిపోయి వచ్చాడు. నాకు పిల్లల్ని ప్రేమగా చూడటం తెలియదట! ఇంటిదగ్గరే ఐదేళ్ళు వచ్చేవరకు పాటలు, పద్యాలు చెప్పుకోవాలని ఒకటే శ్రీరంగనీతులు!"

రోజూ చదివే సుప్రభాతానికి అలవాటుపడ్డ గుళ్లో దేవుడిలా మౌనం వహించి 'ఋషి'లా ఆఫీసుకు వెళ్ళిపోయాడు కొడుకు.

'ఏమిటీ విపరీతం! తనవి చేతబడి చూపులా!' పెంచిన చెట్లని బలి చేయడానికి ఏ తోటమాలి ఒప్పుకుంటాడు.

తన హయాంలో బడిపంతులు ఉద్యోగంతో ఈ ఇల్లు కట్టాడు. ఇప్పుడు కొడుకు తన కంటే నాలుగురెట్లు సంపాదిస్తున్నా ప్రహరీ కట్టించడానికి గిజగిజలాడుతున్నాడు. నెలాఖరు వచ్చేసరికి చేతులు తడుముకోవాల్సిందే. నిజానికి గోడ కట్టించడం కొడుక్కి పెద్ద కష్టం కాదు. కాని నిత్యం శక్తికి మించిన పరుగులు పెట్టే కోడలి ఖర్చు తట్టుకోలేక కొడుకు నీళ్ళు నమలడం తనకు తెలియంది కాదు. తను పిల్లల కాలేజ్ చదువుకి కూడా ఖర్చు పెట్టని డబ్బు కోడలు 'ప్రెస్టేజ్' పేరుతో కాన్వెంట్ చదువులకు తగలేస్తుంది. మనుమలిద్దరూ కవల పిల్లలు. మూడో ఏటనే స్కూల్లో జాయిన్ చేస్తే తను వద్దన్నాడు. పిల్లలిద్దరికీ నీతి పద్యాలు, కథలు చెబుతుంటే 'ముసలి వాసన' అంటూ పిల్లల్ని తన నుండి వేరుచేసింది. ఇరవై ఏళ్లకే మెడిసిన్ పూర్తి చేసి పెట్టిన పెట్టుబడికి తగ్గ సంపాదనపరులని చేయాలనే ఆమె ఆలోచన తనకు అసహ్యం. పిల్లల్ని హాస్టల్లో జాయిన్ చేయకపోతే తాను ఉరిపోసుకుని చచ్చిపోతానని బెదిరించి తన పట్టుదల నెరవేర్చుకుంది. పెద్దవాడు తేజ. వాడిది మెతక స్వభావం కావడంతో తల్లికి జడిసి సర్దుకుపోయాడు. తల్లి ఒడిని బడిగా చేసుకుని చదవాలని వాడి కోరిక. కాని కోడలు ఎప్పుడూ ఆ అవకాశం ఇవ్వలేదు. వాడు సెలవులకు వచ్చినప్పుడల్లా పాము నోట్లో పడ్డ కప్పలా తనను అతుక్కుపోయేవాడు. అది కూడా కోడలికి కంటగింపుగా ఉండేది. ముసలివాళ్ళ దగ్గర ఉండే పిల్లలకు క్రమశిక్షణ ఉండదని, దగ్గర స్కూల్లో బాగా చదవరని, మాస్టార్లు బాగా చెప్పరని ఆమె నమ్మకం. కాని చిన్నవాడు సూర్య తల్లిలాగే పట్టువదలని విక్రమార్కుడు. తను హాస్టల్లో ఉండలేనని బల

వంతంగా ఉంచితే పారిపోతానని బెదిరించి, ఊళ్ళోని బడిలో చేరాడు. ఆమె మాట కొడుకు కాదనడానికి కారణం తానేనని, వాడికి మార్కులు తక్కువ వచ్చినప్పుడల్లా తన మీద విరుచుకువడటం ఆమెకు అలవాటు. స్వతహాగా మనుమలు తెలివైనవాళ్ళు. చదువుఅనే అందమైన అక్షరాలకి ఇనుప సంకెళ్ళు బిగించి 'అమ్మా' అని పిలవడం చేతకాని వయసులో ఎక్కడో దూరాన వేలకు వేలు గుమ్మరించడం ఆమెకు ఆనందం. స్వేచ్ఛగా, ఆనందంగా ఎగురవలసిన పక్షిని బంధిస్తేఎలా గిలగిల కొట్టుకుంటుందో అలా అయింది పెద్దవాడి పరిస్థితి. తల్లిని ఎదిరించే ధైర్యం లేక మానసిక ఒత్తిడితో రాసిన ఉత్తరాలు తనను కలవరపెడుతూంటాయి. కొడుకు లెక్చరర్‌గా చేస్తూ నాలుగంకెలు సంపాదిస్తున్నా జీతం సరిపోవడంలేదని ఒకటే గొడవ. ఇవేమీ పట్టించుకునే స్థితిలో కోడలు ఉండదు. ఆమెకు కావాల్సింది విలాసవంతమైన జీవితం, పిల్లలకు ఖరీదైన చదువులు.

ఆరేళ్ళ వయసులో నాలుగవ తరగతి చదువుతున్నారంటే, ఏడాదికి రెండు క్లాసులతో కళ్ళెంలేని గుర్రాల్లా పరుగులు పెట్టించి వాళ్ల క్లాసు ఎంత పెరిగిందో అంచనా వేసిందే కాని వాళ్ల మనసుకి ఎంత అర్థం అవుతుందో గమనించలేద్ధు. తన మాట నిర్లక్ష్యం చేశాడనే కోపంతో చిన్నకొడుకుని చదువు అనే పరుగుల పందెంలో ఆటబొమ్మని చేసింది. మూడేళ్ళ వయసులో అర్ధరాత్రి దాటేవరకు చదువు. తల్లి గుండెలమీద హాయిగా నిద్రపోవలసిన వయసులో బండెడు పుస్తకాలు ... బరువైన మనసు.

ఎదిగే మొక్కలకు పందిరి అవసరమే. కాని అత్యాశతో మొక్కను ముళ్లకంచెలతో బంధిస్తే ఏపుగా, ఆరోగ్యంగా ఎదుగుతుందా!

తనలాంటి పెద్దతరానికి ఈ విషయం అలజడి రేపితే, కోడలిలాంటి వాళ్ళకు అది చాదస్తంగా అగుపిస్తోంది' -

అలా ఆలోచిస్తూ ఆ రోజంతా రాజశేఖరం బయటకు రాలేదు. కొడుకు ఎంత బ్రతిమాలినా మెతుకు ముట్టలేదు.

సమయం రాత్రి పదకొండు గంటలు దాటింది.

మంచంమీద అటు... ఇటు అస్థిమితంగా కదులుతున్నాడు ఋషి.

మనసు మాత్రం గానుగలో తిరుగుతున్న ఎండిన కొబ్బరి ముక్కలా నలుగుతోంది.

నోటికి అదుపు లేకుండా తండ్రిని ఎన్ని మాటలంది.

ఇన్నాళ్ళు ఆమె మనస్తత్వంతో వేగలేక విడాకులు ఇద్దామనుకున్నాడు. కాని తమ పంతాల కోసం... ఎదిగే పిల్లల బంగారు భవిష్యత్తును బలి చెయ్యడం తన కిష్టంలేక ఎప్పటికప్పుడు సర్దుకుపోతున్నాడు.

ఎంత ఓపిక పట్టినా సహనాన్ని పరీక్షిస్తుంది భార్య లలిత. తండ్రి గురించి ఏం తెలుసని ఇలా మాట్లాడుతుంది. చిన్నప్పుడు తను పెరిగిన పెంపకం తల్లి తండ్రులు ఇచ్చిన ప్రేమాభిమానాలు తన పిల్లలు అందుకోగలుగుతున్నారా! తన తండ్రి పోటీ చదువు ఆశించలేదు. ఆరోగ్యకరమైన చదువు కోరాడు. కాని ఏం జరిగింది?

విద్యార్థుల జీవితాల్లో ఏ క్షణాన రిజర్వేషన్లు వచ్చాయో కాని... తల్లిదండ్రుల పాలిట శాపంగా మారాయి. కష్టపడి చదివిన చదువులని కులాలతో ముడిపెట్టవద్దని - 'మెరిట్'కే ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థుల ఉద్యమం - దానికి నాయకుడు తమ్ముడు శ్రీహర్ష.



## ఆత్మహత్య

"డాక్టర్... ఆపరేషన్ థియేటర్ కొచ్చిన పేషెంట్ కిటికీ నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు..." చెప్పింది నర్స్.

"అరెరె... తొందరపడ్డాడన్నమాట" చింతించాడు డాక్టర్.

-భూక్యా గోపీనాయక్
చిలకలూరిపేట

కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు అమలు చెయ్యాలని కొందరు పట్టుబట్టారు. ఆ పోరాటంలో శ్రీహర్ష సమిధగా ఆహుతైపోయాడు.

శుష్క వాగ్దానాలకు, సానుభూతులకు రాజీపడని శ్రీహర్ష ఆవేశంతో నడిరోడ్డు మీద కిరసనాయిల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు!

తమ్ముడి చావు తండ్రిలో అనుకోని మార్పు తెచ్చింది. పిల్లల్ని స్వేచ్ఛగా పెంచి... వాళ్ళకు ఏది ఇష్టం అయితే అదే చదివించాలని తండ్రి ఎంతో ఉబలాటపడ్డాడు.

భావితరానికి నీడనిచ్చే చెట్లు గొడ్డలి వేటుకి బలికావడం, భవిష్యత్తు కోసం ఐదేళ్ళ నుండి ఇరవై పైబడే వరకు చదువు పేరుతో యుద్ధం చేయడం, చదివిన చదువుకి ప్రతిఫలం కోసం ఉద్యోగాల వేటలో నలిగిపోవడం... ఆ వేటలో కొన్ని పులుల నోళ్ళకు లేడిపిల్లలు బలికావడం...

ఇవన్నీ కళ్ళారా చూసి కలతపడ్డ తండ్రి, మూడేళ్ళ వయసులో తన కొడుకుని స్కూల్లో జాయిన్ చేస్తుంటే జైల్లో వేస్తున్నట్టు బాధపడ్డాడు.

తండ్రి ఇష్టానికి విలువ ఇవ్వనంది భార్య!

*** *** ***

"ఏంటీ రెండు రోజుల్నుండి చూస్తున్నాను. ఏదో పోగొట్టుకున్నట్టు బాధపడుతున్నారు. మీ నాన్న గురించేనా" వెటకారంగా అడిగింది లలిత.

"... ..."

"ఓహో... ఇలా సరుక్కువస్తున్నారా! తండ్రేమో తిండి తినకుండా అలక. మీరేమో మాట్లాడకుండా దీక్ష. బావుందండి. బావుంది. ఎంతయినా మీరూ... మీరూ ఒకటే. నేనే పరాయిదాన్ని. పెట్టిందేదో తిని... కూర్చోక నా గొడవ ఆయనకెందుకు. నా సొంత విషయాల్లో జోక్యం చేసుకొంటే ఫలితం ఇలాగే ఉంటుంది. ఎన్నాళ్ళు ఇలా ఉంటారో నేనూ చూస్తాను."

లలిత కేసి ఋషి తీవ్రంగా చూశాడు.

"ఏమిటీ. ఊరుకునేకొద్దీ పెట్రేగిపోతున్నావ్. ఆడపిల్లలు లేరని నిన్నే ఆడపిల్లగా చూసుకొని నీకు చనువు ఇచ్చినందుకు నెత్తికెక్కుతున్నావ్. పెద్దా... చిన్నా... మంచి... మర్యాదా నీలో ఏమాత్రం ఉన్నా దేవుడిలాంటి నాన్న గురించి ఇలా మాట్లాడవ్. పదేళ్ళ క్రితం చేతి కందిన ఇరవై ఏళ్ళ కొడుకును పోగొట్టుకొని ఇప్పటికే ఆయనెంత నలిగిపోతున్నారో... నీకేం తెల్సు" కోపంగా ధ్వనించింది ఋషి గొంతు."

"దానికి నేనేం చేయను. ఆయన రాత బావుండలేదు. పోయి ఉంటాడు" అంది లలిత.

"హు... నువ్వు ఆడదానివేనా... అందునా నా భార్యవి. మృగాల్లో కూడా మానవత్వం ఉంటుంది. కాని..."

"ఆగారే. అనండి. మనిషిగా పుట్టిన మృగాన్ని అంతేగా... ఏదన్నా ఫర్వాలేదు. ఇంత జరిగాక ఆ ముసలాయన ఇక్కడ ఉండటం నాకిష్టంలేదు."

"ఏం బెదిరిస్తున్నావా!"

"కాదు. హెచ్చరిస్తున్నాను. అలగా మనుష్యులకి పండిపెట్టి, మాటలు అనిపించుకోవాల్సిన అవసరం నాకు లేదు." లలిత మాటలు పూర్తి కాలేదు. ఋషి ఆమె చెంప చెళ్ళు మనిపించాడు.

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ఋషి కళ్ళలో ఎరుపుదనం చూసి లలిత విసురుగా బయటకు వెళ్ళిపోయింది.

*** *** ***

సూర్యకి రోజులు భారంగా గడుస్తున్నాయి. మూడు నెలల పరీక్షలయ్యాక సెలవుల్లో అన్నతో కథలు... కబుర్లతో కాలక్షేపం చెయ్యాలనుకున్న సూర్య కలలను తల్లి లలిత చెల్లాచెదురు చేసింది.

అన్న సెలవుల్లో వస్తే చదువు పాడైపోతుందని అక్కడే వేరే ట్యూషన్స్ కుదిర్చింది.

సూర్యకి ఆరవ తరగతి పుస్తకాలు తెప్పించి... ట్యూషన్స్ పెట్టించింది.

రెండు తరగతుల సబ్జెక్ట్స్ ఒక్కసారే చదవలేనని చెప్పి తన్నులు తిన్నాడు.

తల్లి అర్థం చేసుకోదని సూర్యే తన కలలని సమాధి చేసి... తల్లి మూర్ఖత్వానికి సర్దుకుపోయాడు.

అన్నప్రాశన రోజునే ఆవకాయ తిన్నట్టు ఉంది సూర్య పరిస్థితి

రాజశేఖరం మనుమడి మానసిక ప్రవర్తన అర్థం చేసుకొనే స్థితిలో ఉన్నా... కోడలి నోటిధాటికి జడిసి ఏమీ అనలేకపోయాడు.

సెలవులు గడిచి... పాత... కొత్త పుస్తకాలతో కుస్తీ పట్టిన సూర్య ఐదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాడు. ఇది తట్టుకోలేని లలిత రాజశేఖరాన్ని దుమ్మెత్తిపోసింది. రిజల్ట్స్ చూసుకోవడానికి బడికి వెళ్ళిన సూర్య ఇంటికి తిరిగి రాలేదు.

లలిత సూర్య రెండు మూడు రోజులు ఇంటికి రాకపోయినా ధైర్యంగానే గడిపింది.

'ఎక్కడికి వెళతాడు. రెండు మూడు రోజులు కడుపు మాడితే ఇల్లు గుర్తుకు వస్తుందనే లలిత మూర్ఖత్వాన్ని మాతృత్వం జయించింది.

పది రోజులు గడిచినా సూర్య జాడ తెలియలేదు. రాజశేఖరం సంగతి సరేసరి. పోలీస్ రిపోర్టు ఇచ్చాడు. కనిపించిన చోటల్లా ఓపిక ఉన్నంతవరకూ వెదికాడు. పేపర్లో వేయించాడు. రేడియోలో చెప్పించాడు. అలసట మిగిలింది కాని... అనుబంధం దొరకలేదు. కొడుకు ఇహరాడని నిశ్చయించుకొని లలిత మంచం పట్టింది. కళ్ళు మూసినా... తెరిచినా కొడుకు రూపమే.

'బాబూ! నీకెలా ఇష్టం ఉంటే అలాగే చదువుకొందువుగాని, నీడనిచ్చే పచ్చని చెట్లని గొడ్డలి వేటుతో బలిచేసే నాలాంటి తల్లిని క్షమించు బాబు."

అంటూ కొడుకుని తడిమి... తడిమి ఒడిలో చేర్చుకోవాలనే తహతహ ఆమెలో నిండి ఉంది.

దూరపు కొండలు నునుపని భ్రమపడి... దూరంగా జాయిన్ చేసిన పెద్ద కొడుకు తేజని పశ్చాత్తాపంతో తన దగ్గరకు రప్పించుకొంది. భార్య పడుతున్న బాధను ఆమెలో వచ్చిన మార్పునీ చూసిన ఋషి ఇక నిజం దాచలేకపోయాడు. లలిత పక్కనే కూర్చొని ఆమె బుగ్గల మీద కన్నీటి చారికలను తుడుస్తూ-

'పిచ్చిదానా, మన సూర్య ఎక్కడికి పోలేదు. మా ఫ్రెండ్ ఇంట్లో క్షేమంగా ఉన్నాడు. ఆంక్షలతో వాడి మనసులో పెరుగుతున్న అసహ్యాన్ని గమనించి - ఇలా మన గుండెల్లో చిచ్చుపెట్టి పారిపోయే రోజు వస్తుందేమోనని భయపడ్డాను. అలా జరక్కుండా నీలో మార్పు కోసం ఇలా..." అతని మాటలు పూర్తి కాకుండానే అతని గుండెల్లో తన మొహాన్ని దాచుకొంది! లలిత.